

రెండు హృదయాల కలయిక ప్రేమ

సృష్టిలో అనిర్వచనీయమైన భావన.. ఎన్నటికీ తరగని ప్రేమను తన హృదయంలో శాశ్వతంగా నిలుపుకుంటుంది. ఈ రోజు ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం 8లో▸



నేడు వసంత పంచమి

సరస్వతీ అమ్మవారి జన్మదినోత్సవమైన వసంత పంచమి ఉత్సవానికి బాసర ఆలయం ముస్తాబైంది. బుధవారం బాసరలో వసంత పంచమి వేడుక జరగనుంది. 8లో▸

గరిష్టం/కనిష్టం
33.3 /21.3

వాతావరణం

ఆకాశం చాలావరకు మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. చలి ప్రభావం తగ్గుతుంది.

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి పోటీలకు భైంసా విద్యార్థిని



కోమల్

భైంసాటౌన్: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో భైంసా అల్ఫోర్స్ పాఠశాలకు చెందిన కోమల్ అనే విద్యార్థిని ప్రథమ బహుమతి సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈనెల 29న రవీంద్రభారతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబర్చిన కోమల్‌ను అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అభినందించారు.

29లోగా సీఎంఆర్ లక్ష్యం పూర్తి చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: పెండింగ్ సీఎంఆర్ ఈ నెల 29 లోగా అప్పగించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పౌరసరఫరాల శాఖ అధికారులకు సూచించారు. తన చాంబర్‌లో మిల్లుల వారీగా సీఎంఆర్ పెండింగ్‌పై పౌరసరఫరాల శాఖ అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి సరఫరా చేయాల్సిన పెండింగ్ సీఎంఆర్ త్వరితగతిన ఎఫ్‌సీఐకి అప్పగించాలని సూచించారు. లక్ష్యం పూర్తిచేయని మిల్లర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమీక్షలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీకళ, అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ పకడ్బందీగా నిర్వహించాలి



ప్రాక్టికల్స్‌ను పరిశీలిస్తున్న డీఐఈవో పరశురాం

కుంటాల: ఇంటర్ ప్రాక్టికల్స్ పకడ్బందీగా నిర్వహించాలని డీఐఈవో పరశురాం సూచించారు. కుంటాల ఆదర్శ పాఠశాల, కల్లూర్ వాసవి కళాశాలలో కొనసాగుతున్న ప్రాక్టికల్స్‌ను మంగళవారం పరిశీలించారు. వారివెంట ఫ్లయింగ్‌స్క్వాడ్ కార్గాం వినోద్‌కుమార్, ప్రిన్సిపాళ్లు శ్రీనివాస్ ప్రసాద్, సాయిలు ఉన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న సునీల్‌కుమార్

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో ఉద్యోగులకు మంగళవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో 107 మంది ఉద్యోగులకు బీపీ, షుగర్, ఈసీజీ తదితర పరీక్షలు చేశారు. అనంతరం వైద్యులు వారికి మాత్రలు అందజేశారు. పలు ఆరోగ్య సూచనలు చేశారు. డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులు తమ బాధ్యతతోపాటు, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. డిపో సహాయ మేనేజర్లు, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి అనుమతి ఇవ్వండి



వినతిపత్రం ఇస్తున్న ఆదివాసీ నాయకులు

పెంబి: మండలంలోని షెట్‌పల్లి, ఎంగ్లాపూర్, పస్పుల, పుల్గంపాండ్రి గ్రామాల్లో ఐటీడీఏ ద్వారా ఆదివాసీలకు ఇళ్లు మంజూరయ్యాయని, దీంతో గుడిసెలు తొలగించి ఇళ్ల నిర్మాణం చేపట్టిన తర్వాత అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తోడసం శంభు తెలిపారు. ఈమేరకు పీవీటీజీ ఏపీవో భాస్కర్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. ఇళ్ల నిర్మాణానికి త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో టీఏజీఎస్ ఉట్నూర్ మండల అధ్యక్షుడు నాగోరావు, పెంబి మండల అధ్యక్షుడు హన్మంతు తదితరులు ఉన్నారు.



సాక్షి టాక్‌షోలో పాల్గొన్న నిర్మల్ మెడికల్ కళాశాల విద్యార్థులు

ప్రేమంటే.. ఏమిటంటే..

- ఒకరికొకరు పుట్టినట్లుగా..
- ఇరువురూ అర్థంచేసుకునేలా..
- ఈగోలు లేకుండా.. ఇద్దరూ ఒక్కటేనన్న భావనతో..
- జీవితాంతం కలిసి ఉండాలి..
- పెళ్లి తర్వాత ప్రేమకే ప్రాధాన్యత
- ప్రేమ పేరిట దాడులు దారుణం
- 'సాక్షి' టాక్‌షోలో మెడిసిన్ విద్యార్థులు



నిర్మల్: 'ప్రేమించి పెళ్లి చేసుకోవడం ఒకే. కానీ.. ఆ ప్రేమలో ఈగోలు ఉండొద్దు. ఒకరికొకరు అన్న భావన జీవితాంతం ఉండాలి. అప్పుడే ఆ ప్రేమపెళ్లికి విలువ ఉంటుంది. ఇద్దరిలో ఏ ఒక్కరు అర్థం చేసుకోకున్నా.. ఏ ఒక్కరికి ఈగో ఉన్నా.. ఆ ప్రేమబంధానికి బీటలు మొదలవుతాయి.. చివరకు విడాకుల దాకా తీసుకెళ్తాయి. అదే.. పెళ్లి చేసుకుని ప్రేమించుకోవడం జీవితాన్ని సార్థకం చేస్తుంది. ఈరెండింటిలో ఏదైనా కావొచ్చు.. కానీ ఒకరికొకరు అన్నట్లుగా ఉండటమే అసలైన ప్రేమ..' అని నేటితరం చెబుతోంది. ఇక ప్రేమ పేరిట దాడులు చేయడం, ఒప్పుకోకపోతే హతమార్చడాన్ని సహించలేమంటోంది. అసలు ఈ జనరేషన్‌లో ఇలాంటి దాడులేంటని మండిపడుతోంది. ప్రతి మనిషికీ తనకంటూ స్వేచ్ఛ ఉంటుందని, ప్రేమ, పెళ్లి పేరిట దాడులు చేయడం ఏమాత్రం ఒప్పుకునేది లేదంటోంది. ప్రేమికుల దినోత్సవం నేపథ్యంలో నిర్మల్ ప్రభుత్వ మెడికల్ కాలేజీ విద్యార్థులతో 'ప్రేమలు–పెళ్లిళ్లు–ప్రేమపేరిట దాడులు' అనే అంశంపై 'సాక్షి' మంగళవారం టాక్‌షో నిర్వహించింది. వందమంది మెడికోలు పాల్గొన్నారు. వైద్యవిద్యార్థులు తమ అభిప్రాయాలు వ్యక్తపర్చారు.

అండర్‌స్టాండింగ్ ఉండాలి..



లవ్‌మ్యారేజ్ అయినా.. అరేంజ్ మ్యారేజ్ అయినా.. రెండు అంశాలు ముఖ్యం. ఒకటి ఇద్దరి మధ్య ప్రేమ, రెండోది ఇద్దరి మధ్య అండర్‌స్టాండింగ్ ఉండాలి. ఇవి లేకపోతే ఏ పెళ్లయినా ఎక్కువ కాలం నిలబడదు. ఇద్దరూ ఈగోలు లేకుండా, అర్థం చేసుకునేలా ఉండాలి. – రుమాన్

అర్థం చేసుకునేవాళ్లు ఉండాలి..



జీవితంలో కుటుంబానికి చాలా ప్రాధాన్యం ఉంటుంది. లైఫ్ పార్ట్‌నర్స్ మధ్య అర్థం చేసుకునేతత్వం ఉండాలి. ఒకరినొకరు అర్థం చేసుకునే భావన ఉన్నప్పుడు జీవితం బాగుంటుంది. ఎలాంటి మ్యారేజ్ అయినా ఒకరినొకరు గౌరవించుకోవాలి. – సోని

అర్థం చేసుకోవడంపైనే..



ప్రేమించి పెళ్లి చేసుకున్నా.. పెళ్లి చేసుకుని ప్రేమించాలన్నా.. ఇద్దరు అర్థం చేసుకోవడంపైనే ఆధారపడి ఉంటుంది. ప్రస్తుత సమాజంలో ప్రేమకంటే అరేంజ్ మ్యారేజీలే బెటర్‌గా ఉన్నాయి. – గాయత్రి

నమ్మకంతో ఉండాలి..



ప్రస్తుతం విడాకుల ట్రెండ్ నడుస్తోంది. ఎందుకంటే ఒకరిపై ఒకరికి నమ్మకం లేక విడిపోతున్నారు. ఒకసారి పెళ్లి చేసుకుంటే జీవితాంతం ఇద్దరూ నమ్మకంతో కలిసి బతకాలి. అలాంటి పార్ట్‌నర్‌ను ఎంచుకోవాలి. – నబిలా

రెండూ ఒకటే..



లవ్, అరేంజ్.. ఏ మ్యారేజ్ అయినా బాగానే ఉంటాయి. కానీ.. ఈ రెండూ బాగుండాలంటే ఫస్ట్ లైఫ్ పార్ట్‌నర్స్ ఒకరిపై ఒకరు నమ్మకంతో ఉండాలి. సరైన వ్యక్తిని ప్రేమిస్తేనే జీవితం బాగుంటుంది. – ఉస్మాన్, యోగేశ్

అరేంజ్ మ్యారేజ్ స్ట్రాంగ్..



20 ఏళ్లకుపైగా పెంచిన తల్లిదండ్రుల ప్రేమకంటే అప్పుడే పుట్టిన ప్రేమ కొంతవరకు బాగానే ఉంటుంది. కానీ జీవితాంతం నిలబడటం కష్టంగా మారుతుంది. కానీ అరేంజ్ మ్యారేజ్ అనేది జీవితాంతం స్ట్రాంగ్‌గా ఉంటుందని నా అభిప్రాయం. –వరుణ్

ఇద్దరిపై ఆధారపడి ఉంటుంది..



జీవితమనే పడవను నడపడానికి ఓ భాగస్వామి కావాలి. జీవితాంతం వారిద్దరూ కలిసి ఉండటమనేది వారిద్దరి మెంటాలిటీ ఆధారపడి ఉంటుంది. ప్రేమపెళ్లిళ్లలో విడిపోవడానికి, పెద్దలు కుదిర్చినవి నిలబడటానికి ఇద్దరి మధ్య ఉండే అనుబంధమే కారణం. – విష్ణువర్ధన్

కెరీర్ ఫస్ట్.. మ్యారేజ్ నెక్ట్స్



మన జీవితంలో 20–25ఏళ్ల వరకు పేరెంట్స్‌తో ఉంటాం. 30–40 ఏళ్లపాటు జీవిత భాగస్వామితో ఉంటాం. అలాంటి ప్రేమను కరెక్ట్‌గా సెలెక్ట్ చేసుకోవాలి. దీనికంటే ముందు కెరీర్ ఫస్ట్.. ఆ తర్వాత పెళ్లి ఏరకంగానైనా చేసుకోవచ్చు. ప్రేమ పేరిట జీవితాలను నాశనం చేసుకోవద్దు. – మైత్రి

ప్రాక్టికల్‌గా ఆలోచించాలి..



జీవితంలో కెరీర్, పేరెంట్స్‌కు ఫస్ట్ ప్రయారిటీ ఇవ్వాలి. లైఫ్ పార్ట్‌నర్‌ను ఎంపిక చేసుకునేముందే అన్నీ చూసుకోవాలి. ప్రేమ పేరిట గుడ్డిగా నమ్మకుండా ప్రాక్టికల్‌గా ఆలోచించాలి. ఇద్దరూ కలిసి బతకాలన్నా డబ్బు అవసరం. – నిఖిల

మన ఎంపిక బాగుండాలి..



లైఫ్ పార్ట్‌నర్‌ను ఎంపిక చేసుకునే ముందు బాగా ఆలోచించాలి. మన ఎంపిక బాగుంటేనే జీవితం బాగుంటుంది. ప్రేమైనా, పెద్దలు కుదిర్చిన పెళ్లయినా రెండింటిలో మంచి, చెడు రెండూ ఉంటాయి. లవ్ కమ్ అరేంజ్ మ్యారేజ్ అయితే బాగుంటుంది. – నాజ్రీన్

పరిణతితో ఉండాలి..



ప్రేమ, పెద్దలు కుదిర్చినవి ఏ పెళ్లిళ్లయినా ఇద్దరి మధ్య అర్థం చేసుకునే భావన ఉండాలి. జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకునే ముందు పరిణతితో ఆలోచించాలి. అప్పుడే లైఫ్ బాగుంటుంది. – ఆకాంక్ష

ఆలోచనలోనే ఉంటుంది..



ఏరకమైన పెళ్లయినా మనం ఆలోచించే విధానంలోనే ఉంటుంది. నిజంగా ఓ వ్యక్తిని ప్రేమిస్తే చంపడం అనేది ఉండదు. ఒక వ్యక్తిపై దాడి చేయడం, చంపడం అనేది సరికాదు. అంతలా నచ్చకపోతే వారినలా వదిలేయాలి అంతే. – ప్రత్యూష

పార్టీ ప్రతినిధుల సమక్షంలో మాక్ పోల్



మాక్ పోల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్‌చైన్‌గేట్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలకు మొదటి లెవల్ చెకింగ్ పూర్తిచేసిన అనంతరం సమీకృత కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం గోదాం ఆవరణలో మంగళవారం మాక్ పోల్ నిర్వహించారు. వివిధ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ రానున్న పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్, ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్స్, కంట్రోల్ యూనిట్స్, వీవీ ప్యాట్స్ మొదటి లెవల్ చెకింగ్ పూర్తి చేయడం జరిగిందన్నారు. ఇందులో181 రిజక్ట్ చేయడం జరిగిందన్నారు. ఈసీఐఎల్ ఇంజినీర్ల 10 మంది బృందం ఆధ్వర్యంలో ఫస్ట్ లెవెల్ చెకింగ్ ముగిసిందన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిదుల సమక్షంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పనితీరును ప్రయోగాత్మకంగా పరిశీలించేందుకు వీలుగా ర్యాండమ్ పద్ధతిన మాక్ పోల్ నిర్వహించామని వివరించారు. అధికారులు పూర్తి పారదర్శకంగా వ్యవహరిస్తూ , నిబంధనలు పాటించి, ఓటింగ్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, కాంగ్రెస్ యూత్ ప్రెసిడెంట్ గాజుల రవి, బీజేపీ జిల్లా సెక్రెటరీ శ్రావణ్‌రెడ్డి, ఎంఐఎం జనరల్ సెక్రెటరీ మజర్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ రమేశ్, ఎలక్షన్ టెక్నికల్ ఇంజినీర్ సాహో, ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

'రైతు గ్రామీణ బంద్ విజయవంతం చేయాలి'



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ఈనెల 16న జరిపే దేశవ్యాప్త పారిశ్రామిక రైతు గ్రామీణ భారత్ బంద్ జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజా రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మంచిర్యాల చౌరస్తా నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 44 చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చడం, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర, కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ 26 వేలు, ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు పరం వంటి సమస్యలపై బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మికులు, కర్షకులు, రైతులు, సంఘటిత అసంఘటిత కార్మికవర్గం సమ్మెలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.బక్కన్న, కార్యదర్శి రామలక్ష్మణ్, జిల్లా నాయకులు కె.లక్ష్మి, కె.రాజు, చిన్నయ్య, రవి పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- గెజిటెడ్ అధికారుల సంఘం కేంద్ర కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, సత్యనారాయణ



సభ్యత్వనమోదు చేపడుతున్న సంఘం సభ్యులు

నిర్మల్‌ఖిల్లా: క్షేత్రస్థాయిలో సామాజిక ప్రగతి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు వంటి కార్యక్రమాల్లో గెజిటెడ్ అధికారుల సంఘ సభ్యులందరూ భాగస్వాములు కావాలని గెజిటెడ్ అధికారుల సంఘం కేంద్ర కమిటీ సభ్యులు ఏలూరి శ్రీనివాసరావు, ఏనుగు సత్యనారాయణ అన్నారు. నిర్మల్ జిల్లాకేంద్రంలో గెజిటెడ్ అధికారుల సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీ గెజిటెడ్ అధికారి సంఘంలో సభ్యత్వం తీసుకోవాలన్నారు. రానున్న 15 రోజుల్లో రాష్ట్రస్థాయిలో పారదర్శకంగా నూతన కమిటీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి డాక్టర్ పీజీ.రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యంరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రవీణ్, సత్యపాల్ రెడ్డి, సురేశ్, వసంతరావు, శ్యామ్, పరమేశ్వర్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, డాక్టర్ రాజేశ్వర్, డాక్టర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్లభాష పరిరక్షణలో ఎల్టా పాత్ర కీలకం

- వరంగల్ ఆర్‌జేడీ సత్యనారాయణ



మాట్లాడుతున్న ఆర్జేడీ సత్యనారాయణ

నిర్మల్ రూరల్: ఆంగ్ల భాష పరిరక్షణలో ఎల్టా పాత్ర కీలకమని, భాష నైపుణ్యాలను పెంపొందించడంలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ ఉపాధ్యాయులు మరింతగా విద్యార్థులను ప్రోత్సహించాలని విద్యాశాఖ వరంగల్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని సోఫీనగర్ బాలికల గురుకుల విద్యాలయంలో ఎస్సీఈఆర్టీ, ఎల్టా సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన స్పెల్ విజార్డ్, డ్రామా జిల్లాస్థాయి పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో ఆంగ్ల భాష నైపుణ్యాలు సాధించడానికి ఉపయోగపడతాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించడానికి ఆంగ్ల భాష ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారన్నారు. విద్యార్థుల్లో నిగూఢమైన భాష నైపుణ్యాలను వెలికి తీయడంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదన్నారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబర్చారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఆంగ్ల భాషలో ప్రదర్శించిన 26 డ్రామా పోటీల్లో 163 మంది ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీల నుంచి విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభచాటారు. న్యాయనిర్ణేతలుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ శంకర్, యు.రవికుమార్, వశిష్ట డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అఖిలేశ్‌కుమార్‌సింగ్ వ్యవహరించారు. అనంతరం పోటీల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులను డీఈవో రవీందర్‌రెడ్డి అందజేశారు. ప్రిన్సిపాల్ గంగాశంకర్, ఎల్టా జిల్లా అధ్యక్షుడు కడార్ల రవీంద్ర, ప్రధాన కార్యదర్శి భూమన్నయాదవ్, ప్రతినిధులు వేణుగోపాల్, రతన్‌కుమార్, మనోహర్‌రెడ్డి, వివేక్, రామ్మోహన్, సంధ్యారాణి, ఆంగ్ల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించనివారిపై చర్యలు

- డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజేందర్

పెంబి: ప్రభుత్వ ఆసుపత్రిలో సమయపాలన పాటించని సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజేందర్ హెచ్చరించారు. పెంబి పీహెచ్‌సీని మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఆదివారం మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ఆరేళ్ల పాపకి ఫిట్స్ రావడంతో పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. సిబ్బంది ఎవరూ లేకపోవడం, మధ్యాహ్నం 3 గంటలకే ఆసుపత్రి గేటు మూసి వేసిన సంఘటనపై విచారణ చేపట్టారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం మందుల వివరాలు, రికార్డులు పరిశీలించారు.

ఎంపీడీవోలకు పోస్టింగ్

ఖానాపూర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని పలు మండలాల ఎంపీడీవోలను ప్రభుత్వం బదిలీ చేసింది. వారి స్థానంలో ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారిని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ నియమించారు. కుభీర్ ఎంపీడీవోగా ఎం.శ్రీనివాస్, నిర్మల్ రూరల్ ఎంపీడీవోగా గజానన్‌రావు, కడెం ఎంపీడీవోగా అరుణ, నర్సాపూర్(జీ) ఎంపీడీవోగా పుష్పలత, సోన్ ఎంపీడీవోగా సురేశ్, పెంబి ఎంపీడీవోగా రమాకాంత్, ఖానాపూర్ ఎంపీడీవోగా సునీత, తానూర్ ఎంపీడీవో అబ్దుల్ సమద్, లక్ష్మణచందా ఎంపీడీవోగా రామ్‌ప్రసాద్, సారంగాపూర్ ఎంపీడీవోగా లక్ష్మీకాంత్‌రావు, దస్తురాబాద్ ఎంపీడీవోగా రమేశ్, మామడ ఎంపీడీవోగా సుశీల్ రెడ్డి, దిలావార్‌పూర్ ఎంపీడీవోగా అరుణరాణి, ముథోల్ ఎంపీడీవోగా బి.రాములును నియమించారు.

పంటనష్టం పరిశీలన

- బాధిత రైతులకు పరిహారం అందేవిధంగా చూస్తాం
- నష్టపోయిన పంటలు పరిశీలించిన ఎమ్మెల్యే రామారావ్‌పటేల్



పంటలను పరిశీలిస్తున్న రామారావ్ పటేల్

తానూరు: అకాల వర్షం, ఇదురుగాలులకు ఆదివారం మండలంలోని ఆయా గ్రామాల్లో మొక్కజొన్న, పెద్దజొన్న, శనగా పంటలు దెబ్బతిన్నాయి. హిప్నెల్లి, కోలూరు, మొగ్లి, మసల్గా, ఎల్వి గ్రామాల్లో ఎమ్మెల్యే రామారావ్‌పటేల్ పర్యటించారు. భారీ వర్షం, ఈదురు గాలులకు నేలవాలిన పంటలను పరిశీలించారు. పంటనష్టం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పూర్తి వివరాలు సేకరించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. నియోజకవర్గంలో జరిగిన పంటనష్టం విషయాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. బాధిత రైతులకు పరిహారం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఏడీఏ వీణ, నాయకులు శివాజీ పటేల్, లక్ష్మణ్‌రెడ్డి, చక్రధర్‌పటేల్, వై.చిన్నారెడ్డి, మారుతి ఆయా గ్రామాల రైతులు ఉన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దాసరి శంకర్



సభ్యత్వం ఇస్తున్న జిల్లా అధ్యక్షుడు దాసరి శంకర్

లోకేశ్వరం: పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బిల్లులు ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపే చెల్లించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దాసరి శంకర్ కోరారు. మండలంలోని ధర్మోర, పంచగుడి, లోకేశ్వరం, కన్కపూర్ తదితర గ్రామాల్లో టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా శంకర్ మాట్లాడుతూ కేజీబీవీ, సీఆర్టీలను రెగ్యూలరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల పదోన్నతులు చేపట్టాలని కోరారు. పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పుట్ట రవి కిరణ్, రమేశ్, టీయూటీఎఫ్ అధ్యక్షుడు పైడిపెల్లి భోజన్న పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యవసాయం చేస్తూ.. ఉద్యోగం సాధించి


సబ్బిడి దేవేందర్

కుంటాల: మండల కేంద్రానికి చెందిన సబ్బిడి లక్ష్మి - ఎర్రన్న దంపతుల చిన్న కుమారుడు సబ్బిడి దేవేందర్ ఇటీవల వెలువడిన గురుకుల పీజీటీ (పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్) ఫలితాల్లో బాసర జోన్‌లో రెండవ ర్యాంక్ సాధించిన పీడీ (ఫిజికల్ డైరెక్టర్)గా ఎంపికయ్యాడు. తండ్రి ఎర్రన్న గతంలో మృతి చెందగా తల్లి లక్ష్మితో కలిసి వ్యవసాయ పనులు చేస్తూ చదువుకున్నాడు. ఒకటి నుంచి పదో తరగతి వరకు కుంటాల ప్రభుత్వ పాఠశాలలో, ఇంటర్, డిగ్రీ కల్లూర్ వాసవి కళాశాలలో పూర్తి చేశాడు. పట్టుదలతో ఉద్యోగం సాధించిన దేవేందర్‌ను పలువురు అభినందించారు.

గురుకుల కొలువు సాధించిన నవీన్


నవీన్ కుమార్

ఆదిలాబాద్‌టౌన్: గురుకులం బోర్డు నిర్వహించిన ఉపాధ్యాయ నియామక పరీక్ష ఫలితాల్లో ఆదిలాబాద్ పట్టణానికి చెందిన నవీన్ కుమార్ పీజీటీ కొలువు సాధించాడు. పట్టణంలోని ఖానాపూర్‌కు చెందిన ఇజ్జగిరి నవీన్ కుమార్ మంగళవారం గురుకుల బోర్డు విడదలు చేసిన మల్టీజోన్ తెలుగు ఫలితాల్లో ఎంపికయ్యాడు. గతంలో మైనార్టీ గురుకులంలో కాంట్రాక్ట్ పద్ధతిపై ఉపాధ్యాయుడిగా పనిచేసిన ఈయన పీజీటీగా ఎంపిక కావడంపై కుటుంబీకులు, బంధుమిత్రులు అభినందించారు.

కుక్కకాటుతో ఎద్దు మృతి


మృతి చెందిన ఎద్దు

కుంటాల: మండలంలోని లింబా(కె)గ్రామానికి చెందిన దాసరి సాయన్న ఎద్దు కుక్కకాటుతో మృతి చెందింది. ఎద్దును నాలుగు రోజుల క్రితం కుక్క కాటు వేయగా పశువైద్యాధికారి ప్రకాష్ చికిత్స అందించారు. చికిత్స పొందుతూ ఎద్దు మంగళవారం మృతి చెందింది. దాని విలువ రూ.75 వేలు ఉంటుందని బాధిత రైతు వాపోయాడు.

మానసిక వికలాంగురాలిపై అత్యాచారయత్నం

దస్తురాబాద్: మానసిక వికలాంగురాలిపై అత్యాచారయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఖానాపూర్ సిఐ బి.మోహన్ వివరాల ప్రకారం... మండల కేంద్రానికి మానసిక వికలాంగురాలు (మూగ) ప్రతి రోజు మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల వద్దకు వెళ్లి మధ్యాహ్న భోజనం కోసం వేచి చూస్తుండేది. రోజులాగే పాఠశాల ఎదుట నిలబడి ఉండగా నిందితుడు సమీపంలోని తన ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచారయత్నానికి పాల్పడగా కాలనీవాసులు గమనించగా పారిపోయాడు. కుటుంబ సభ్యులకు విషయం తెలియడంతో నిందితుడిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పిచ్చికుక్కల బెడద

భైంసా: బాసరలో పిచ్చికుక్కల బెడద పెరిగింది. ఆలయ పరిసరాల్లో పిచ్చికుక్కలతో ఇబ్బందులు తప్పడం లేదు. మంగళవారం సాయంత్రం నలుగురిని పిచ్చికుక్క కాటేసింది. వెంటనే స్థానికులు బాసర ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో వీరంతా చికిత్సలు చేయించుకున్నారు. పిచ్చి కుక్కల బెడద అరికట్టాలని భక్తులు కోరుతున్నారు.

'దివ్య'మైన ప్రేమ


రమ్యకృష్ణ, నర్సింహారావు

నెన్నెల: వారిద్దరి మధ్య మాటలు లేవు. అయినా 'మూగ' మనస్సుల మధ్య ప్రేమ చిగురించింది. మూడుముళ్ల బంధం వైపు నడిచింది. నెన్నెల మండలంలోని గంగారం గ్రామానికి చెందిన సెగ్యం రాజన్న-లక్ష్మి దంపతుల కుమార్తె రమ్యకృష్ణ, భద్రాచలంకు చెందిన నాగేశ్వర్‌రావు-తులసి దంపతుల కుమారుడు నర్సింహారావు ఇద్దరూ మూగవారే. హైదరాబాద్‌లోని మూగ కళాశాలలో డిగ్రీ వరకు కలిసి చదువుకున్నారు. అక్కడ ఏర్పడిన పరిచయం కాస్తా ప్రేమగా మారింది. ఇరు కుటుంబాల తల్లిదండ్రులను ఒప్పించి 2021 డిసెంబర్ 29న పెళ్లి చేసుకున్నారు.



రెండు హృదయాల కలయిక ప్రేమ

సృష్టిలో అనిర్వచనీయమైన భావన.. ప్రేమ. అది అనుభవించాలే గానీ అర్థం చేసుకోవడం కష్టం. ప్రేమ ఎలా పుడుతుందో... ఎవరికీ అంతుపట్టదు. ఆకర్షణకన్నా అర్థం చేసుకునే పునాదులపై ఏర్పడిన ప్రేమ కలకాలం నిలబడుతుంది. అది నిస్వార్థమైన ప్రేమ. ఎన్నటికీ తరగని ప్రేమను తన హృదయంలో శాశ్వతంగా నిలుపుకుంటుంది. ప్రేమదాసులు దేవదాసులైనా... పెళ్లి తర్వాత ప్రేమలు ఫెయిల్యూర్ అయినా.. అసలైన ప్రేమ మాత్రం అజ రామరంగా నిలిచి వెలుగుతుంది. ఈ రోజు ప్రేమికుల దినోత్సవం. ప్రాణం తీసే ప్రేమలు కాదు, ప్రాణం పోసే ప్రేమలు వర్ధిల్లాలని మనసారా కోరుకుందాం.

ప్రేమికుల రోజే ప్రేమపెళ్లి


సాయిమూర్తి, మౌనిక

ప్రేమకు కులం, మతం లేదని, రెండు మనస్సులు, ఇద్దరి అభిప్రాయాలు ఒక్కటైతే చాలంటున్నారు నెన్నెల మండలానికి చెందిన ప్రేమికులు పోతరాజుల సాయిమూర్తి (కాపు), దుర్గం మౌనిక (నేతకాని). ఇద్దరూ నెన్నెల ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు కలిసి చదువుకున్నారు. ఇద్దరి మధ్య స్నేహం ఉండేది. ఆ స్నేహమే ప్రేమగా మారింది. ఆతర్వాత పెద్దలను ఒప్పించి 2022, ఫిబ్రవరి 14న కులాంతర వివాహం చేసుకున్నారు.

వాళ్లిద్దరూ ఒక్కటయ్యారు..


మానస, సాయికుమార్

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని హన్మాన్‌బస్తీకి చెందిన పెద్దపల్లి మానస, పోస్టాఫీసు బస్తీకి చెందిన భూక్య సాయి కుమార్ మధ్య 2009లో పరిచయం ఏర్పడింది. పీజీ పూర్తి చేసిన మానస మున్నూరుకాపు, డిగ్రీ చదువుకున్న సాయికుమార్‌ది లంబాడీ సామాజికవర్గం. కులాంతర వివాహానికి యువతి తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో పెద్దలను ఎదిరించి 2018, ఏప్రిల్ 21న వివాహం చేసుకున్నారు. సాయికుమార్ స్నేహితులు అండగా నిలబడి లక్సెట్టిపేటలోని టీటీడీ కళ్యాణ మండపంలో సంప్రదాయబద్ధంగా పెళ్లి జరిపించారు. ఆ తర్వాత ఇరు కుటుంబాలు కలిసిపోయాయి.

పెద్దలను ఒప్పించి...



భైంసా టౌన్: భైంసా పట్టణానికి చెందిన ప్రముఖ గైనకాలజిస్ట్ వనజ, రేడియాలజిస్ట్ అజయ్‌కుమార్‌రెడ్డిలు ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. తమ ప్రేమ గురించి తెలిసి ఇరువురి కుటుంబాల్లో మొదట ఒప్పుకోలేదు. ఇరువైపులా పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకున్నాం. ఆరో తరగతి వరకు కలిసి చదువుకున్నాం. వైద్య విద్య చదువుతున్న సమయంలో పరిచయం ప్రేమగా మారింది. దీంతో ఇంట్లో పెద్దలకు విషయం చెప్పడంతో ఒప్పుకున్నారు. ప్రస్తుతం ముగ్గురు పిల్లలతో తాము ఆనందంగా ఉన్నాం.

- డాక్టర్ వనజ- అజయ్‌కుమార్‌రెడ్డి

ప్రేమే ఉన్నతంగా తీర్చిదిద్దింది...



నిర్మల్‌ఖిల్లా: ఉస్మానియా మెడికల్ కళాశాలలో 1995లో ఎంబీబీఎస్ వైద్య విద్య కోర్సు చదువుతున్నప్పుడు ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. మొదటగా అనితకు నా మనసులో మాట చెప్పాను. కొంత సమయం తీసుకుని ఓకే చెప్పింది. డాక్టర్లుగా స్థిరపడిన తర్వాతనే పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నాం. ఇరు కుటుంబాల పెద్దలు అడ్డుచెప్పారు. 2002లో వివాహం చేసుకున్నాం. ఇద్దరం నిర్మల్ జిల్లా కేంద్రంలోనే ప్రైవేట్ ఆస్పత్రిని నెలకొల్పి ప్రస్తుతం ప్రముఖ డాక్టర్లుగా ఎదిగాం. ఓ పాప, బాబుతో జీవితాన్ని సాఫీగా సాగిస్తున్నాం.

- ఉదగిరి అనిత-రామకృష్ణ

మతాలు వేరైనా..


ఎస్.కె.ఇర్ఫాన్, అవని

తాంసి: మతాలు వేరైనప్పటికీ వారిని ప్రేమ ఒక్కటిచేసింది. ప్రేమకు మతాలు అడ్డురావని మరోమారు నిరూపించి ఆదర్శంగా నిలుస్తోంది ఈ యువ జంట. భీంపూర్ మండలంలోని నిపాని గ్రామానికి చెందిన ఎస్.కె.ఇర్ఫాన్, గంపల అవని ఒకే గ్రామానికి చెందిన ఇరువురికి చిన్నప్పటి నుంచే పరిచయం ఉంది. వీరి పరిచయం కాస్త ప్రేమగా మారింది. వీరి ప్రేమను పెద్దలు ఒప్పుకోలేదు. దీంతో పెద్దలను ఎదురించి వివాహం చేసుకున్నారు. వీరి ప్రేమకు గుర్తుగా ఏడాదిన్నర క్రితం బాబు ఉన్నాడు. ప్రస్తుతం ఇరు కుటుంబ సభ్యులు సైతం వారి ప్రేమను అంగీకరించారు.

దూరం దగ్గర చేసింది...



నిర్మల్‌ఖిల్లా: మాది ఆదిలాబాద్ జిల్లా.. నా భార్యది పెద్దపల్లి జిల్లా. మేము ఇద్దరం 2010లో హైదరాబాద్‌లో నర్సింగ్ కాలేజీలో చదువుతున్నప్పుడు ప్రేమ మొదలైంది. అప్పటి నుండి ఇద్దరు ఒకరిపై ఒకరికి ప్రేమ పెరిగి వివా హం చేసుకుందామనుకున్నాం. పెద్దలు ససేమిరా అన్నప్పటికీ ఇరు కుటుంబాలను ఒప్పించి 2016లో పెళ్లిం చేసుకున్నాం. మాకు కవలలు జన్మించారు. ప్రస్తుతం ఇద్దరు బాబులతో జీవితం ప్రశాంతంగా సాగుతోంది. ఇటీవల నాకు నర్సింగ్ ఆఫీసర్‌గా నిర్మల్ జిల్లా కేంద్ర ప్రధాన ఆస్పత్రిలో ఉద్యోగం వచ్చింది.

- అనుపమ-విజయానంద్

అర్థం చేసుకుని ముందుకెళ్లాలి



కౌటాల: జీవితంలో అన్ని అంశాలను అర్థం చేసుంటూ ముందుకెళ్లాలి. ప్రేమించడం నేరం కాదు. కానీ ప్రేమ అనేది అంధకారంలోకి నెట్టేదిగా ఉండొద్దు. ప్రస్తుతం ప్రేమ అనేది గత ప్రేమికుల మాదిరిగా నిజాయతీగా ఉండడం లేదు. కొందరి మధ్య ఉండే సాన్నిహిత్యాన్ని ప్రేమగా భావించడం తప్పు. చదువుకుని ఉన్నత స్థాయికి చేరితే మిగతావన్నీ దరిచేరుతాయి.

- పి. ప్రియ, డిగ్రీ విద్యార్థిని, కౌటాల

చదువుపై దృష్టి ఉండాలి



కౌటాల: ఆధునిక కాలంలో యువత చెడు వ్యసనాల బారిన పడేందుకు చేతిలో సెల్‌ఫోన్, డబ్బులు, సోషల్ మీడియా అందుబాటులో ఉంది. చదువు కోవడం ద్వారానే ఉన్నత స్థానాలకు చేరుకుంటాం. ఆ తర్వాత మన భవిష్యత్‌ను తల్లిదండ్రులే నిర్ణయిస్తారు. ప్రేమ వివాహమైనా తల్లిదండ్రుల ఇష్టంతో చేసుకుంటే బాగుంటుంది.

- టి.రాహుల్, డిగ్రీ విద్యార్థి, కౌటాల

వాళ్లకే బాగా తెలుసు..



కౌటాల: అందరి జీవితాల్లో ప్రేమ, పెళ్లి రెండూ ముఖ్యమే. చదువుకునే సమయాన ఇతర విషయాలపై దృష్టి సారించొద్దు. జీవితంలో స్థిరపడిన తర్వాత మనకేం చేయాలో, ఏమేం ఇవ్వాలో తల్లిదండ్రులకు తెలిసి ఉంటుంది.

- ఆర్.సుప్రియ, డిగ్రీ విద్యార్థిని, కౌటాల

జేఈఈ మెయిన్స్‌లో జిల్లా విద్యార్థుల ప్రతిభ

ఆదిలాబాద్‌టౌన్: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఎస్ఆర్ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు రాణించారు. ఇందులో సాయి సిద్దార్థ 94.73 శాతం, వెంకట శ్రీకర్ 91 శాతం, మాధవ్ 90.48 శాతం, రాంబాబు 90.23, తనిష్కా 85.86, జయరుద్ర 79.11, నల్ల శ్రీజ 78.34, సుఖ్‌బీర్‌కౌర్ 74.23 శాతం ఫలితాలు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను జోనల్ ఇన్‌చార్జి శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపల్ బ్రహ్మం అరవింద్, జైపాల్ రెడ్డి అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం


బిట్టు

ఆదిలాబాద్‌టౌన్: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని కైలాస్‌నగర్‌కు చెందిన రాజేశ్వర్ -సునీత దంపతుల కుమారుడు బిట్టు ప్రతిభ కనబర్చాడు. ఈ ఏడాది జనవరి 30న నిర్వహించిన పరీక్షలో ఆల్ ఇండియా వ్యాప్తంగా 96శాతం మార్కులు సాధించాడు. సదరు విద్యార్థికి కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు.

నిర్మల్ జిల్లా విద్యార్థిని..


గడ్డం నేహారెడ్డి

నర్సాపూర్(జి): మండల కేంద్రానికి చెందిన గడ్డం అలేఖ్య-రమేశ్‌రెడ్డి దంపతుల కుమార్తె గడ్డం నేహారెడ్డి మంగళవారం వెలువడిన ఐఐటీ-జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచి 98.238 శాతం సాధించింది. హైదరాబాద్‌లోని శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసింది. దీంతో విద్యార్థినికి పలువురు అభినందనలు తెలియజేశారు.

గల్ఫ్ కార్మిక సంక్షేమానికి భరోసానివ్వాలి

- ప్రవాసీమిత్ర కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల

నిర్మల్‌ఖిల్లా: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మంగళ, బుధవారాల్లో రెండు రోజుల పర్యటన నిమిత్తం గల్ఫ్ దేశమైన యూఏఈ రాజధాని అబుదాబిలో పర్యటిస్తున్న నేపథ్యంలో గల్ఫ్ కార్మికుల పక్షాన ప్రవాసీమిత్ర కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల బహిరంగ లేఖ రాశారు. గల్ఫ్ దేశాల్లో ఉపాధి నిమిత్తం వెళ్లి పనిచేస్తున్న కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలని లేఖలో కోరారు. ఈ మేరకు మంగళవారం నిర్మల్ జిల్లాకేంద్రంలో బహిరంగ లేఖను విడుదల చేశారు. ఇందులో గల్ఫ్ కార్మికులు ఆయా దేశాల్లో, స్వదేశానికి తిరిగి వచ్చిన తర్వాత ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం ఎదుర్కొంటున్న సమస్యలను లేవనెత్తారు. గల్ఫ్ దేశాల్లో 88లక్షల మంది వలస కార్మికులు నివసిస్తున్నారని వారందరికీ సామాజిక, ఆర్థిక భద్రత కల్పించేలా సంక్షేమ పథకాలు అమలు పరచాలని విజ్ఞప్తి చేశారు.

నేడు వసంత పంచమి

- బాసర ఆలయంలో ఉత్సవానికి ఏర్పాట్లు పూర్తి
- భారీగా తరలిరానున్న భక్తులు


గోదావరినది వద్ద హారతిఘాట్‌లో భక్తులు


బాసర ఆలయంలో భక్తులు

భైంసా(ముధోల్): సరస్వతీ అమ్మవారి జన్మదినోత్సవమైన వసంత పంచమి ఉత్సవానికి బాసర ఆలయం ముస్తాబైంది. బుధవారం బాసరలో వసంత పంచమి వేడుక జరగనుంది. ఏటా మాఘ శుద్ధ పంచమి రోజున నిర్వహించనున్న ఈ వేడుకకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అమ్మవారి దర్శనానికి మనరాష్ట్రంతో పాటు దక్షిణ, ఉత్తర భారత రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి రానున్నారు. భక్తులకు సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టారు. అశేష జనవాహినికి సరిపడే ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. ప్రత్యేక ప్రసాదాల కౌంటర్లు, తాగునీరు, వైద్య సదుపాయాల ఏర్పాట్లు పూర్తయ్యాయి. క్యూలైన్‌లలో చిన్నారులకు పాలు, బిస్కెట్లు అందించనున్నారు. ప్రత్యేక అక్షరాభ్యాసం మండపాలు ముస్తాబయ్యాయి. సుమారు 70వేల మంది వరకు భక్తులు తరలివస్తారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రసాదాల కొరత రానీయకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. భక్తులకు నిరంతర అన్నదానం నిర్వహించనున్నారు.

ప్రత్యేకత, పూజలు

చదువుల తల్లి జన్మదినం సందర్భంగా మాత సన్నిధిలో అక్షర శ్రీకారం నిర్వహించుకుంటే తమ చిన్నారులు ఉన్నత విద్యావంతులు అవుతారని భక్తుల నమ్మకం. అందుకే ఏటా వందలాది మంది చిన్నారులకు అక్షరాభ్యాస పూజలు జరుగుతాయి. ఉత్సవం సందర్భంగా బుధవారం వేకువజామున రెండు గంటలకు మంగళ వాయిద్య సేవ, సుప్రభాత సేవలతో ఉత్సవం ప్రారంభమవుతుంది. రెండున్నర గంటల నుంచి అమ్మవారికి మహాభిషేకం, అలంకరణ, నివేదన నిర్వహిస్తారు. అనంతరం అక్షరాభ్యాస, కుంకుమార్చన పూజలు ప్రారంభమవుతాయి. సాయంత్రం ఏడు గంటలకు అమ్మవారికి పల్లకి సేవ నిర్వహిస్తారు.

భారీ బందోబస్తు...

ఉత్సవంలో ఎలాంటి అపశ్రుతులు చోటు చేసుకోకుండా పోలీసు శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. ఆలయం, గోదావరి స్నాన ఘట్టాలు, పార్కింగ్ స్థలాల వద్ద అదనపు భద్రతా చర్యలు చేపట్టనున్నట్లు బాసర ఎస్సై గణేశ్ తెలిపారు. ఆలయ ప్రధాన ద్వారాల వద్ద మెటల్ డిటెక్టర్లు ఏర్పాటు చేసి సీసీ కెమెరాలతో నిఘా వేయనున్నట్లు సీఐ తెలిపారు.

తరలివస్తున్న భక్తజనం...

వసంత పంచమి వేడుకల్లో పాల్గొనేందుకు మంగళవారం సాయంత్రం నుంచే భక్తులు బాసరకు తరలి వస్తున్నారు. సాయంత్రానికి ఆలయ అతిథి గృహాలు, ప్రైవేటు లాడ్జీలు భక్తులతో నిండిపోయాయి. బాసర వచ్చే బస్సులు, రైళ్లు భక్తులతో కిటకిటలాడాయి. ప్రైవేటు లాడ్జీలన్నీ నెల రోజుల క్రితమే బుకింగ్ కావడంతో చాలా మంది భక్తులు బయటే ఉండిపోయారు. బాసర వచ్చే భక్తులకు నిత్య అన్నదానం నిరంతరాయంగా ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ఈఓ విజయరామారావు తెలిపారు. బాసర ఆలయం విద్యుత్‌కాంతుల్లో శోభాయమానంగా కనిపిస్తుంది. ఆలయంలో ఎటుచూసినా భక్తులే కనిపిస్తున్నారు.

ప్రత్యేక పూజలు...

మంగళవారం ఆలయ ప్రధాన అర్చకుడు సంజీవ్ పుజారీ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో సరస్వతీ నామాలు, సరస్వతీ మాత అనుష్టానం, జపం, పారాయణంచేశారు. అమ్మవారి విశిష్టతను భక్తులకు వివరిస్తున్నారు.

ప్రమాదవశాత్తు కాలువలో పడి వ్యక్తి మృతి


నవీన్(ఫైల్)

లక్ష్మణచాంద: ప్రమాదవశాత్తు కాలువలో జారిపడి వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని వడ్యాల్ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... మండలంలోని వడ్యాల్ గ్రామానికి చెందిన విబూది నవీన్(39) ఆదివారం ఉదయం 10గంటలకు పని నిమిత్తం ఇంటి నుండి బయటకి వెళ్లి సాయంత్రమైనా తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు గ్రామంలో గాలించినా ఆచూకీ దొరకలేదు. దీంతో సోమవారం నవీన్ భార్య విబూది లక్ష్మి తన భర్త కనిపించడం లేదని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై శ్రీకాంత్ మిస్సింగ్ కేసు నమోదు చేశాడు. సోమవారం వడ్యాల్ సమీపంలోని సరస్వతి కాలువ వద్ద నవీన్ మోటార్ సైకిల్, చెప్పులు ఉండటంతో ఆ వైపుగా కుటుంబ సభ్యులు గాలించగా రాత్రి 10.30 గంటల సమయంలో వాగులో మృతదేహం కనిపించింది. పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మంగళవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాలకృత్యాల కోసం వెళ్లి కాల్వలో జారిపడి మృతిచెంది ఉంటాడని కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

భైంసారూరల్: మండలంలోని గుండేగాం వంతనపై నుంచి దూకి కొంగర్ల రాజు(27) ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... కుభీర్ మండలంలోని పార్డి(బి) గ్రామానికి చెందిన కొంగర్ల రాజు తన భార్యతో గొడవ పడడంతో పుట్టింటికి వెళ్లిపోయింది. నాలుగేళ్లుగా ఒంటరిగా ఉంటూ మద్యానికి బానిసయ్యాడు. గతంలో రెండుసార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సోమవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి సోదరుడికి ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సమాచారం ఇచ్చి వంతెనపై నుంచి నీటిలో దూకాడు. కుటుంబీకుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఒడి బియ్యం హుండీల అందజేత


బియ్యం హుండీలను అందజేస్తున్న దాతలు

భైంసా: బాసర సరస్వతి అమ్మవారి ఆలయానికి దాతలు ఓడి బియ్యం హుండీలను అందజేశారు. మంగళవారం కామారెడ్డి జిల్లా హర్గొండ గ్రామానికి చెందిన కందాడి నరేందర్‌రెడ్డి హుండీలను అందించారు. కందాడి జగ్గమ్మ జ్ఞాపకార్థం రెండు హుండీలను అందజేశారు. ఆలయ అధికారులు దాతలను సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం


భూమి పూజ చేస్తున్న ఎంపీ

కడెం: బీజేపీతోనే దేశంలో అభివృద్ధి సాధ్యమని ఎంపీ సోయం బాపూరావు అన్నారు. మంగళవారం మండలంలోని లింగాపూర్ గ్రామంలో రూ.21లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఇందులో మాజీ సర్పంచ్ బాలవ్వ, ఎంపీటీసీ సరళాదేవి, బీజేపీ మండలాధ్యక్షుడు కిష్టయ్య, నాయకులు లచ్చన్న, మనోజ్, రంజిత్, రాజేందర్ ఉన్నారు.